
www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 6 డిసెంబర్ 2024



పిఎస్ఎల్వి-59 రాకెట్ ప్రయోగం సక్సెస్

నింగిలోకి యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ఉపగ్రహాలు



ప్రజాశక్తి-సూళ్లూరుపేట: శ్రీహరికోటలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి గురువారం సాయంత్రం 4గంటల 12 నిమిషాలకు ఇస్రో ప్రయోగించిన పిఎస్ఎల్వి-59 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. దీంతో ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ శాస్త్ర వేత్తలకు అభినందనలు తెలిపారు. ఎన్ఎస్ఐఎల్ భాగస్వామ్యంతో ఈ ప్రయోగం చేపట్టామని ఛైర్మన్ తెలిపారు. ఇంతకుముందు ఇస్రో ప్రయోగించిన ఆదిత్య ఎల్ 1కు తోడుగా ప్రస్తుతం ప్రోబా 3 పరిశోధనలు చేపట్టనుంది. ఆదిత్య ఎల్ 1, ప్రోబా3లు సేకరించే డేటా ఒకదానికొకటి పూర్తి చేస్తాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. సూర్యుని బాహ్య వలయంలోని కరోనా పొరను అధ్యయనం చేయడం, అక్కడ అవసరమైతే కృత్రిమ సూర్య గ్రహణాలు కూడా ఏర్పాటు చేసి సూర్యుడి గుట్టును రట్టు చేసేందుకు ఈ ప్రోబా3 ని అత్యంత అధునీకరించిన ఉపకరణాలతో నిర్మించారు. ఈ డేటాను సేకరించే ఉపగ్రహాలు ఇస్రో ప్రయోగించే పెరిజి ,అపోజిల దూరం కన్నా కొంత భిన్నంగా ఉండడం ఒక విశేషం.పెరిజి అంటే భూమికి దగ్గర దూరం కేవలం 600 మీటర్లు కాగా, అపోజి అంటే భూమికి ఎక్కువ దూరం 60.530 కిలోమీటర్లుగా ఈ ఉపగ్రహాలు పరిభ్రమించనున్నాయని శాస్త్రవేత్తలు విలువైన సమాచారం అందిస్తాయని తెలిపారు. ఈ రాకెట్తో పాటు ప్రయోగించిన యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ఉపగ్రహాలు కూడా విజయవంతమయ్యాయి.ఈ రాకెట్ విజయం సాధించడంతో ఇస్రోకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిందని శాస్త్రవేత్తలు ఆనందం వ్యక్తం చేశారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

- ఎనిమిదేళ్ల తర్వాత ప్రజాక్షేత్రంలో పరిష్కారాలు
- ఒక్కరోజు రుసుం లేకుండా ధృవపత్రాలిస్తామని కలెక్టర్ వెల్లడి
- పారదర్శకంగా నిర్వహించాలని సిపిఎం సూచన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దీర్ఘకాలికంగా జిల్లాలో చిక్కుముడిగా మిగిలిన భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నేటి నుండి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని, ఈ రెవెన్యూ సదస్సులను భూ సమస్యలు వున్న వారు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై జిల్లాలోని రాజకీయ, రైతు సంఘాల నాయకులతో జిల్లా కలెక్టరేట్లో గురువారం సమావేశం నిర్వహించి వారి నుండి సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో ప్రజాశాంతి ఉద్దంగా, పండుగ వాతావరణంలో ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహించేలా షెడ్యూలు తయారు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1051 రెవెన్యూ గ్రామాలలో ఈ సదస్సులు నిర్వహిస్తామన్నారు. గతంలో జరిగిన ఫ్రీహోల్డ్ ల్యాండ్, రీ సర్వే, మ్యూటేషన్, భూ ఆక్రమణలు, నిషేధిత సెక్షన్ 22ఏ ఇలాంటి సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించడానికి సంబంధిత విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. రెవెన్యూ సదస్సుల్లో పరిష్కారం చూపి పొందే ధృవపత్రాలకు ఆ ఒక్కరోజు ఎలాంటి రుసుం లేకుండా అందిస్తామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చే ప్రతి అర్జీకి అర్జీదారుడికి రసీదు ఇస్తామన్నారు. డిసెంబర్ 6 నుండి రెవెన్యూ సదస్సుల ప్రణాళిక జనవరి 8 2025 వరకు 33 రోజులు పాటు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఆయా ప్రాంతాలకు చెందిన నాయకులు రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీలకు చెందిన వారు వివిద ప్రాంతాల్లో భూ పట్టాల సమస్యలు, ఎంజాయ్మెంట్ ధృవపత్రాల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. తిరుపతి నగరంలో పలు డివిజన్లలో పట్టాలు, రిజిస్ట్రేషన్ సమస్యలను సమావేశం ముందుంచారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో భూమిలేని లబ్దిదారులు ఉన్నారని, ప్రభుత్వ భూమి ఉన్నా వారికి కేటాయించలేదని, రెవెన్యూ సదస్సుల ద్వారా అయినా వారికి న్యాయం చేయాలన్నారు. గొప్ప ఆలోచనతో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో స్థానిక దళిత వాడల్లో శ్మశాన వాటికలు, వాటికి రోడ్డు మార్గాలను ఏర్పాటు చేయాలని, అనుభవదారులకు పట్టాలను మంజూరు చేయాలని కలెక్టర్ను కోరారు. సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ గతంలో పట్టాలిచ్చిన వారికి ఇప్పటి వరకు భూములను చూపలేదన్నారు. పట్టాలు పొందిన వారు అధికారుల కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయారన్నారు. ఎక్కువ భాగం అటవీ, రెవెన్యూ విభాగాలకు సంబంధించిన భూ సమస్యలే అధికంగా ఉన్నాయన్నారు. రేణిగుంట కరకంబాడీ పంచాయతీ పరిధిలో 153 ఎకరాల కొండ భూమిని సిద్దుల రవి ప్రభుత్వ అధికారులను మభ్యపెట్టి పట్టాలుగా మార్చి అమ్ముకుంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. మరాల పేరుతో భూములను ఆక్రమించుకోవడం, నకిలీ పట్టాలను సృష్టించి భూములను స్వాహా చేస్తున్నారన్నారు. దొరవారిసత్రంలోనూ ఇదే పరిస్థితి వుందని వందల ఎకరాలను దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారన్నారు. రెవెన్యూ సదస్సులకు హాజరయ్యే అర్జీదారులకు సౌకర్యవంతమైన సేవలు కల్పించాలని కలెక్టర్ను కోరారు. కలెక్టర్ రాజకీయ నాయకుల సలహాలు అమలు చేసి రెవెన్యూ సదస్సుల ద్వారా కనీసం మూడు మండలాల్లో ఒక్క రెవెన్యూ సమస్య కూడా లేకుండా చెయ్యడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ సదస్సుల ప్రారంభంలో భాగంగా రాష్ట్ర కమిటీ పలు ప్రాంతాలలో పర్యటిస్తుందన్నారు. ఈ సమావేశంలో సూళ్లూరుపేట, వెంకటగిరి ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, రామకృష్ణ, జేసీ శుభం బన్సల్, డిఆర్ఓ, నరసింహులు, టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్, మనోహరాచారి, రైతు సంఘం నాయకురాలు హేమలత, శ్రీధర్ వర్మ, పలు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్ వెంకటేశ్వర్

రెవెన్యూ సదస్సులు పారదర్శకంగా నిర్వహించాలి: సిపిఎం

ఈ సమావేశం సందర్భంగా రెవెన్యూ సదస్సులను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని కోరుతూ కలెక్టర్ వెంకటేశ్వర్కు సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, రైతు సంఘం జిల్లా నాయకులు హేమలత వినతిపత్రం అందించారు.



కలెక్టర్కు వినతిపత్రంఅందిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

ఎస్వియూలో జీతాలు లేక ఉద్యోగులు వెలవెల

- రెండు నెలలు అవుతున్నా అందని జీతాలు
- భార్యల పుస్తెలు తాకట్టు పెడుతున్న ఉద్యోగులు



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, ఆచార్య ఎన్జీరంగా వర్సిటీ ఆధ్వర్యంలో నడిచే శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో రెండు నెలలు పూర్తవుతున్నా జీతాలు అందక శాశ్వత బోధన, బోధనేతర ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ముఖ్యంగా ఎస్వియూ, శ్రీపద్మావతి మహిళా వర్సిటీలలో బోధన, బోధనేతర సిబ్బందికి రెండు నెలలు పూర్తయి మూడో నెలలో 8 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు జీతాలు అందకపోవడం సిబ్బంది తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఇప్పటికే వర్సిటీలోని పలువురు శాశ్వత అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తమ విలువైన వస్తువులను, బంగారు నగలు తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి ఈఎమ్ఐలు కడుతున్నట్లు వాపోతున్నారు. మరి కొంత మంది బోధనేతర సిబ్బంది తమ భార్యల పుస్తెలను కూడా తాకట్టు పెట్టి డబ్బులు తెచ్చుకున్న పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 17 విశ్వవిద్యాలయాల్లో పనిచేసే సిబ్బంది కూడా చాలా తక్కువగా ఉన్న వారి జీతాలను కనీసం రెండు నెలల తర్వాత అయినా ఇవ్వకుండా ప్రభుత్వం నాన్చుడు ధోరణిలో వ్యవహరిస్తుండడం ఉద్యోగులకు తీవ్ర వేదన మిగుల్చుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగులు జీతాలు లేక తీవ్ర అసంతృప్తి, నిరాశ, నిస్పృహ్యల ఊబిలో కూరుకుపోయారు. ఎస్వీయూలో శాశ్వత అధ్యాపకులు 159 మంది, బోధనేతర ఉద్యోగులు 482 మంది, టైం స్కేల్ ఉద్యోగులు 350 మంది, అకడమీక్ కన్సల్టెంట్లు 200 మంది పైగా పనిచేస్తున్నారు. వీరందరికీ దాదాపు రెండు నెలలు పైగా జీతాలు రాకపోవడం తీవ్ర బాధాకరంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీ ఉన్నతాధికారులు ఇప్పటికైనా చొరవ తీసుకొని రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ అధికారులతో చర్చించి రెండు రోజుల్లో జీతాలు వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

రేపు మెగా పేరెంట్, టీచర్ సమావేశాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్, టీచర్ సమావేశాలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. తిరుపతి కలెక్టరేట్లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడుతూ దేశంలో మొట్టమొదట పేరెంట్స్, టీచర్ సమావేశాలను నిర్వహించి విద్యార్థులకు, అక్కడి పాఠశాల ఉపాధ్యాయులకు మధ్య మంచి సంభాషణను ఏర్పాటు చేయడం, సోషల్ మీడియా, చిన్నారుల భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థి విద్యపై చూపుతున్న ఆసక్తి, ఏఏ ఆటలు ఆడుతారో వంటి విషయాలను స్వయంగా విద్యార్థుల తల్లిదండ్రులే తెలుసుకునే అవకాశం ఉందన్నారు. కొత్తగా విద్యార్థి చదువు, పరీక్షల్లో వచ్చిన మార్కులు, ఆటలపై ఆసక్తి ఇలా అనేక అంశాలను తెలిపేలా హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు(హెచ్పిసి)ని ప్రతి విద్యార్థికీ అందివ్వనున్నామన్నారు. ఈ కార్డు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఓ నరసింహులు, జిల్లా విద్యాశాఖాధికారి కుమార్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం ఏర్పాటుపై ఐద్వా హర్షం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటుపై ఐద్వా హర్షం ప్రకటించింది. ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి గురువారం మాట్లాడుతూ మధ్యహ్న భోజనం పేద విద్యార్థులకు, గ్రామీణ ప్రాంతాల నుండి కళాశాలకు వెళ్లే విద్యార్థులకు, వ్యవసాయ పనులకువెళ్లే తల్లిదండ్రులు క్యారియర్ ఇవ్వడం ఆలస్యమైతే ఆ రోజు పస్తులతో గడిపేవారని, అలాంటి విద్యార్థులకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని, ముఖ్యంగా యుక్తవయస్సు విద్యార్థినులకు, రక్తహీనతతో బాధపడుతున్నారని వారికి పౌష్టికాహారం అందించడంతో ఉపయోగకరంగా వుంటుందన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అమలు చెయ్యాలని విజ్ఞప్తి చేశారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

శేషాచలం అటవీ పరిధి ప్రకాశం జిల్లా గిద్దలూరు అటవీ ప్రాంతంలో 18 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు గురువారం తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాలతో కడప సబ్ కంట్రోల్ ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ పీ నరేష్ బృందం కూంబింగ్ నిమిత్తం కొమరోలు కు వెళ్లి అక్కడ నుంచి అటవీ అధికారులు లక్ష్మీ నాయక్, జమాల్ వల్లిలతో కలసి గిద్దలూరు డివిజన్ చింతలపల్లి వైపుగా కూంబింగ్ కొనసాగించారన్నారు. అక్కడ కనుమబావి రస్తా వద్ద కొంతమంది వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా వారిని సమీపించే సరికి కొందరు పారిపోయారని వారిలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. సమీపంలో పరిశీలించగా 18 ఎర్రచందనం దుంగలు కనిపించాయని, పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తులు ప్రకాశం జిల్లా వాసులుగా గుర్తించామన్నారు. ఈ ఘటనపై తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్ లో సిఐ సురేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.



మాట్లాడుతున్న టిటిడిఈవో శ్యామలరావు

అంకిత భావంతో సేవలు అందించండి: టిటిడి ఈవో

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల పంచమి తీర్థానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు అంకిత భావంతో సేవలందించాలని టిటిడి ఈవో జె శ్యామల రావు పిలుపు నిచ్చారు. పంచమి తీర్థానికి డిప్యూటేషన్ పై నియమితులైన ఉద్యోగులు తమ విధులను మరింత అంకితభావంతో సేవలు అందించాలని టీటీడీ ఈవో కోరారు. తిరుచానూరు ఆస్థాన మండపంలో గురువారం సాయంత్రం ప్రత్యేకంగా టిటిడి సిబ్బందిని, శ్రీవారి సేవకులను ఉద్దేశించి ఈవో మాట్లాడుతూ పంచమి తీర్థం పర్వదినం సందర్భంగా పుణ్య స్నానాలు ఆచరించేందుకు తమిళనాడు, ఇతర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు తిరుచానూరులో నాలుగు హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే భక్తులు హోల్డింగ్ పాయింట్లలో విశ్రాంతి తీసుకుంటున్నారని, వీరికి అన్న ప్రసాదాలు, అల్పాహారం, తాగునీరు, బాదంపాలు అందించేందుకు టిటిడి ఉద్యోగులు, శ్రీవారి సేవకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పుష్కరిణిలో ఒకేసారి 16 వేల మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించవచ్చని వారికి అవసరమైన ప్రవేశ, నిష్క్రమణ గేట్లు, క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. 1700 మంది భద్రతా సిబ్బంది, డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించనున్నట్లు వివరించారు. శ్రీవారి సేవకులు భక్తులకు అందిస్తున్న సేవల వల్ల టిటిడికి చాలా మంచి పేరు వచ్చిందన్నారు. పంచమి తీర్థం రోజున ప్రత్యేకంగా 1,000 మంది శ్రీవారి సేవకులతో అన్నప్రసాదం, తాగునీరు పంపిణీ చేయనున్నట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సివిఎస్ఓ శ్రీధర్, సిఈ సత్యనారాయణ, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందా రాజన్, డిప్యుటేషన్ ఉద్యోగులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

పోటు ఇన్ఛార్జిపై వేటు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థాన ప్రసాదాల తయారీ పోటు ఇన్ఛార్జి సురేష్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేస్తూ గురువారం ఆలయ ఈవో బాపిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ప్రసాదాల పోటు తో పాటు కౌంటర్ ను ఈవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పులిహోరకు సంబంధించి పోటు స్టాకుకు కౌంటర్ స్టాకుకు మధ్య వ్యత్యాసం ఉండడంతో పోటు ఇన్ఛార్జిపై చర్యలు తీసుకున్నట్లు ఈవో తెలిపారు.

బర్డ్, స్విమ్స్ ఆస్పత్రులను ప్రజోపయోగంగా మార్చండి

ప్రజాశక్తి -తిరుమల: టిటిడి ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న బర్డ్, స్విమ్స్, ఆయుర్వేద ఆస్పత్రు లను ప్రజోప యోగంగా తీర్చి దిద్దాలని బర్డ్కు పూర్తి స్థాయి డైరెక్టర్ను నియ మించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి టిటిడి పాలక మండలి అధ్యక్షులు బిఆర్ నాయుడుకి వినతి పత్రం సమర్పించారు. గురువారం మధ్యాహ్నం కందారపు మురళి తిరుమల లోని ఛైర్మన్ కార్యాలయంలో బిఆర్ నాయుడిని కలిసి టిటిడి ఆస్పత్రుల తీరుతెన్నుల గురించి వివరించారు. బర్డ్ ఆస్పత్రికి పూర్తిస్థాయి డైరెక్టర్ లేకపోవడం మూలంగా పరిపాలన కుంటుపడిందని, అభివృద్ధి పనులు ఆగిపోయాయని రోగులకు అవసరమైన నిర్ణయాలు చేయడంలో ఆలస్యం చేస్తున్నారని వివరించారు. ఆఖరుకు మెడికల్ ఆఫీసర్లు కూడా లేని పరిస్థితి నెలకొందని, వివాదాల పేరిట పోస్టుల భర్తీలో జాప్యం జరుగుతోందన్నారు. స్విమ్స్లో ప్రాణదానం పథకం పూర్తిగా ఎత్తివేశారని, టిటిడి స్విమ్స్ బాధ్యతలను తీసుకున్న తర్వాత పేదలకు అందుతున్న వైద్య పరిధి తగ్గిందని, ఆరోగ్యశ్రీ నిధులు సరిపోని కారణంగా వైద్యం పూర్తికాకముందే రోగులను డిశ్చార్జి చేస్తున్నారని, గతంలో ప్రాణదానం పథకంతో ఆదుకునే వారని గుర్తు చేశారు. పేదల నుంచి డబ్బులు వసూలు చేయకుండా వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. బర్డు, స్విమ్స్ ఆస్పత్రుల పారిశుధ్య కార్మికులలో కొందరిని కార్పొరేషన్ ద్వారా తీసుకున్నారని, మరికొందరు కాంట్రాక్టర్ల వద్ద బానిస బతుకులు బతుకు తున్నారని అందరినీ కార్పొరేషన్ ఉద్యోగులుగా చేర్చుకోకుండా టిటిడి యాజమాన్యం వివక్ష చూపడం అన్యాయమని ఛైర్మన్కు వివరించారు. తక్షణం ప్రజలు, కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా టిటిడి బోర్డు సానుకూల నిర్ణయాలు చేయాలని విజ్ఞప్తి చేశారు.



టిటిడి ఛైర్మన్కు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు జిల్లా కార్యదర్శి కందారపు మురళి

టిటిడి ఛైర్మన్కు సిఐటియు నేత కందారపు మురళి వినతి


చిరు వ్యాపారులకు న్యాయం చేయండి

శ్రీవారి మెట్టు నడక మార్గంలో చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్న పేదలు గత 110 రోజులుగా టిటిడి పరిపాలనా భవనం వద్ద నిరసన దీక్షలు చేస్తున్నారని, వారికి న్యాయం చేయాలని కందారపు మురళి విజ్ఞప్తి చేశారు. శ్రీవారి మెట్టు నడక మార్గంలో చిరు వ్యాపారులు పాతిక సంవత్సరాలుగా మెట్టు మార్గాన్ని నమ్ముకుని జీవిస్తున్నారని గుర్తు చేశారు. వీరి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. టిటిడి పాలకమండలి అధ్యక్షులు బిఆర్ నాయుడు స్పందిస్తూ స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద ఆసుపత్రులనే కాకుండా టిటిడిలోని అన్ని రకాల ఆస్పత్రులను పరిశీలించి భక్తులకు సామాన్యులకు తోడ్పడే సాధనాలుగా మార్చడానికి కసరత్తు చేస్తున్నామని త్వరలోనే వివరాలు ప్రకటిస్తామని డైరెక్టర్ నియామకం తొందర్లో పూర్తవుతుందని వివరించారు. శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

చేనేత చూపు..ఉచిత విద్యుత్తు వైపు

- 200 యూనిట్ల ఉచిత విద్యుత్పై ప్రకటన
- నేతన్నల్లో హర్షాతిరేకాలు

ప్రజాశక్తి- డక్కిలి : ఉచిత విద్యుత్తు ప్రకటన కోసం జిల్లాలో వెంకటగిరి , పుత్తూరు నారాయణవనం , శ్రీకాళహస్తి , చెన్నూరు , గూడూరు తదితర ప్రాంతాల్లోని వేలాది చేనేత కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. మగ్గం చేతితో నడిచినా.. వృత్తి పని చేయడానికి నిత్యం విద్యుత్తు అవసరమవుతుంది. ఒక చేనేత వస్త్రం తయారీ వెనుక ఎంతో శ్రమ, కళ, తరతరాల వృత్తి నైపుణ్యంతో పాటు విద్యుత్తుఅవసరముంటుంది. పత్తితో తయారైన దారాన్ని, లేదా మల్బరీ పట్టును శుద్ధిచేయడానికి వేడి నీళ్లలో ఉడుకబెట్టాల్సి ఉంటుంది. నిర్ణీత ఉష్ణోగ్రతలో రంగులను వేడి చేయాలి. రంగులద్దిన దారాన్ని మళ్లీ ఉడుకబెట్టాల్సి ఉంటుంది. నీళ్లను, రంగులను వేడి చేయడానికి విద్యుత్తు హీటర్లు ఉపయోగిస్తారు. చిటికి పోయడానికి ఉపయోగించే ఆసుయంత్రం, కండెలు చుట్టడానికి ఉపయోగించే ఆధునిక రాట్నం కరెంటుతోనే నడుస్తుంది. చీకటింట్లోని మగ్గానికి విద్యుత్తు దీపం వెలిగితేనే దారపు పోగు కంటికి కన్పిస్తుంది. కరెంటు వెలుగులో కళ్లు తదేక దీక్షతో ఒక్కో పోగునూ డిజైనుకు అనుగుణంగా సరి చేస్తేనే వస్త్రంతయారవుతుంది. విద్యుత్తు బిల్లులు చేనేత వృత్తిదారులకు భారంగా మారాయి. నెలకు రూ. వందల్లో విద్యుత్తుబిల్లులు చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు. వ్యవసాయ రంగానికి ఇస్తున్నట్టుగా తమకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని చేనేత కార్మికులు ఎప్పటినుండో చేనేత కార్మికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మరమగ్గాలు పూర్తిగా విద్యుత్తుతోనే నడుస్తున్నందున ఆ రకం మగ్గాలు కలిగిన చేనేత కార్మికులకు విద్యుత్ బిల్లుల భారం మరింత భారంగా పరిణమించింది. చేనేతలకు కూటమి ప్రభుత్వం వరాల జల్లు ఆంధ్రప్రదేశ్లోని చేనేత కార్మికులకు టీడీపీ కూటమి సర్కారు శుభవార్త వినిపించింది. చేనేత మగ్గాలు ఉన్నవారికి నెలకు 200 యూనిట్ల వరకూ ఉచిత కరెంట్ అందిస్తామని తెలిపింది. మరమగ్గాలు ఉన్నవారికి 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందించనున్నట్లు ఏపీ జౌళి శాఖ మంత్రి సవిత అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. మంగళవారం అసెంబ్లీలో మాట్లాడిన మంత్రి సవిత.. టీడీపీ కూటమి సర్కారు వారికి అండగా నిలుస్తుందని చెప్పారు. ఇంకా చేనేత కార్మికులకు ఆరోగ్య బీమా కల్పిస్తామని మంత్రి సవిత ప్రకటించారు. ఐదు శాతం జీఎస్టీ రీయింబర్స్మెంట్, కర్నూలు, విజయనగరంలో చేనేతశాలలు ఏర్పాటు చేస్తామంటూ నేతన్నలపై వరాల జల్లు కురిపించారు. చేనేత వస్త్రాల మార్కెటింగ్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్న జౌళి శాఖ మంత్రి సవిత.. ఇందుకోసం విదేశాల్లో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆరు నెలల్లోగా రాష్ట్రంలో మూడు ఆప్కో షోరూమ్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్లో ఆదిత్య బిర్లా గ్రూప్ సహకారంతో పది చేనేత క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని మంత్రి అసెంబ్లీ వేదికగా వెల్లడించడం చేనేత కార్మికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి






ఉచిత విద్యుత్ ఇస్తే ఉపయోగం

వ్యవసాయం తర్వాత రెండో స్థానం చేనేతది. ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్తును, రాయితీలను అందించి ప్రోత్సహిస్తోంది. చేనేత వృత్తిదారులకు ప్రభుత్వం ఇలాంటి సదుపాయాలు కల్పించాలి. నూలు ఉడుకబెట్టడానికి, రంగుల అద్దకానికి, ఆసు యంత్రం నడవడానికి, రాట్నం తిప్పడానికి, మగ్గానికి నిత్యం కరెంటు అవసరముంటుంది. ప్రభుత్వం ఇప్పటికైనా 200 యూనిట్లుఉచిత కరెంటు చేనేతకు వర్తింప చేస్తానని చెప్పడం ఆర్థికంగా చేయూతనిచ్చినట్టే..

- సీ హెచ్ చినఓబయ్య, అధ్యక్షుడు, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం. వెంకటగిరి.

వేద పండితులకు బంపర్ ఆఫర్

- మళ్లీ రాహు కేతు పూజలకు అనుమతి
- ఆజాద్ ఉత్తర్వులు బుట్టదాఖలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో విధులు నిర్వర్తిస్తున్న వేద పండితులకు మళ్లీ బంపర్ ఆఫర్ వచ్చింది. రాహు కేతు పూజలు చేసే విధంగా ఇఓ బాపిరెడ్డి ఉత్తరువు ఇచ్చారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వేద పండితులు కూడా రాహు కేతు పూజలు చేయడానికి అనుమతించారు. అయితే కొందరిపై భక్తులు ఆరోపణలు చేశారు. బలవంతంగా దక్షిణ వసూలు చేస్తున్నారనీ, దక్షిణ ఇవ్వకుంటే దుర్భాష లాడుతున్నారని రాతపూర్వకంగా ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై స్పందించిన అప్పటి ఇఓ చంద్రశేఖర్ ఆజాద్ వేద పండితులకు రాహు కేతు పూజలకు సంబంధం లేదంటూ తేల్చేశారు. దీంతో అప్పటి నుంచి వారు వేద పారాయణం, దీపారాధన, ఆశీర్వచనాలకు మాత్రమే పరిమితమయ్యారు. బాపిరెడ్డి రెగ్యులర్ ఇఓగా వచ్చిన తర్వాత ప్రముఖులకు రాహు కేతు పూజలు చేయడానికి కూడా వేద పండితులు ముందుకు రాలేదు. ఉత్తరువు లేనిదే పూజలు చేయబోమని భీష్మించు కున్నారు. అంతేకాకుండా రాజకీయ ఒత్తిళ్లు కూడా వచ్చినట్లు సమాచారం. దీంతో తిరిగి రాహు కేతు పూజలకు వేద పండితులను అనుమతిస్తూ ఇఓ బాపిరెడ్డి గురువారం ఉత్తర్వులిచ్చారు. మొత్తం 17 మంది వేద పండితులకు, అర్చకులకు రాహు కేతు పూజలు చేయడానికి అనుమతించారు. గతంలో వేద పండితులకు రాహుకేతు పూజలు అప్పగించడంపై భారీ మొత్తంలో చేతులు మారినట్లుగా ప్రచారం జరిగింది. అందువల్లే భక్తుల నుంచి బలవంతంగా వసూళ్లు చేశారనే ప్రచారం కూడా సాగింది. ఇలాంటి ఆరోపణలకు తావివ్వకుండా భక్తుల నుంచి బలవంతంగా వసూలు చేయ కుండా చూడాల్సిన బాధ్యత అధికారు లపై ఉంది. పూజలు చేయించుకునే భక్తులు తమ పాప పరిహారం కోసం ఎంతో కొంత నగదును ఇవ్వడం ఆనవాయితీ. అయితే బలవంతం చేయడం వల్ల ఆలయానికి అప్రతిష్ట. బలవంతంగా దక్షిణ అడిగినా భక్తులు మిన్నకుండి పోతారే తప్ప అధికారులకు ఫిర్యాదు చేయడం అరుదు. దక్షిణ ఇవ్వకుంటే దూషించడం, శపించడం లాంటి కార్యక్రమాలు చేయడం వల్ల మనస్థాపం చెందిన భక్తులు సాక్షాత్తు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఫిర్యాదు చేయాల్సి వచ్చింది. అలాంటివి లేకుండా అర్చకులు, వేద పండితులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారులు కేవలం కార్యా లయానికి, ప్రముఖులకే పరిమితం కాకుండా పరిపాలనపై, రాహు కేతు పూజల పర్యవేక్షణపై దృష్టి పెడితే ఇటువంటి ఆరోపణలు రావడానికి అవకాశం ఉండదు. బోర్డులను కూడా ఏర్పాటు చేయాలి. ఆలయానికి చెడ్డపేరు రాకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.



టిటిడి ఛైర్మన్ బిఆర్నాయుడును ఆశీర్వదిస్తున్న వేదపండితులు

తిరుమలలో టిటిడి ఛైర్మన్ క్యాంపు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి -తిరుమల:

తిరుమలలోని టిటిడి ఛైర్మన్ క్యాంపు కార్యా లయాన్ని టిటిడి ఛైర్మన్ బిఆర్నాయుడు గురువారం ప్రారంభిం చారు. ఇటీవలే ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో చిన్నపాటి మరమ్మతులు చేయడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ దంపతులకు వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో టిటిడి అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు శాంతారామ్, డిప్యూటీ ఈవోలు లోకనాథం, హరీంద్రనాథ్, భాస్కర్, వీజీవో రామ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.



ఇండోర్ స్టేడియంను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే శ్రీనివాసులు

క్రీడాకారుల ప్రోత్సాహానికే మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్:

క్రీడాకారుల ప్రోత్సాహానికే మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఇందిరా మైదానంలో ఇండోర్ స్టేడియంలో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ ఎన్ మౌర్య, రవినాయుడుతో కలిసి కలెక్టర్ శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి ప్రజలకు మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ను సుమారు రూ. 8.80 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో ఇండోర్ స్టేడియం నిర్మించామన్నారు. ప్రజలకు, క్రీడాకారులకు పలు రకాల క్రీడలను అందుబాటులోకి తీసుకు రానున్నామని శుభ పరిణామమని తెలిపారు. ఈ ఇండోర్ స్టేడియంలో బాస్కెట్ బాల్ , వాలీబాల్ షటిల్ వంటి క్రీడలతో పాటు ఇండోర్ క్రీడలు అందుబాటు లోకి వచ్చాయని తెలిపారు. గ్రౌండ్ ఫ్లోర్లో రెండు బ్యాడ్మింటన్ కోర్టులు, వాలీబాల్, బాస్కెట్ బాల్ కోర్టులు ఉంటాయని, మొదటి అంతస్తులో రెండు టేబుల్ టెన్నిస్ కోర్టులు, రెండు క్యారమ్ బోర్డులు, ఒక ఎయిర్ హాకీ, ఒక పూల్ టేబుల్ కోర్టులు, రెండవ అంతస్తులో జిమ్ ఏర్పాటు చేశారని తెలిపారు. మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను ఎమ్మెల్యే , శాప్ ఛైర్మన్, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. నిరంతరాయంగా తిరుపతి ప్రజలకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు, క్రీడలు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ను క్రీడాంధ్రప్రదేశ్గా మార్చాలని సంకల్పంతో ప్రతి ఒక్కరూ మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలంటే క్రీడల ఎంతో ముఖ్యమని వీటిపై ఆసక్తి చూపాలని . తిరుపతిని స్పోర్ట్స్ హబ్గా మార్చాలని సంకల్పంతో తిరుపతి నగరం జాతీయ క్రీడలకు వేదిక కావాలని ఆలోచనతో స్టేడియం ఏర్పాటుకు రూపకల్పన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ శిరీష్, స్మార్ట్ సిటీ మేనేజర్ చంద్రమౌళి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ , డిప్యూటీ కమిషనర్ అమరయ్య పాల్గొన్నారు.

పరిశ్రమలకు ఎన్ఏబిఎల్ గుర్తింపు..ప్రయోజనాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి -సత్యవేడు: క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసిఐ) అనుబంధ సంస్థ నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్ (ఎన్ఏబిఎల్), శ్రీసిటీ సహకారంతో గురువారం శ్రీసిటీలో 'పరిశ్రమలకు ఎన్ఏబిఎల్ గుర్తింపు, ప్రయోజనాలపై' గురువారం అవగాహన ఏర్పాటు చేశారు. ఎన్ఏబిఎల్ బెంగళూరు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి శ్రీసిటీ, పరిసర ప్రాంతాలలోని వివిధ రంగాల పరిశ్రమలకు చెందిన 50 మందికి పైగా నాణ్యతా నిపుణులు హాజరయ్యారు. ఎన్ఏబిఎల్ గుర్తింపు ప్రాధాన్యత, తద్వారా సమకూరే ప్రయోజనాలు, పరిశ్రమల నాణ్యతా ప్రమాణాలు మెరుగులో దాని పాత్ర వంటి వివిధ అంశాలపై ఎన్ఏబిఎల్-క్యూసిఐ డిప్యూటీ డైరెక్టర్ డి రంజిత్ కుమార్ సమగ్ర అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఎగుమతి పరిశ్రమలకు ఎన్ఏబిఎల్ గుర్తింపు వల్ల దేశీయంగా, అంతర్జాతీయ పోటీ మార్కెట్‌లో చేకూరే వివిధ ప్రయోజనాలు వివరించారు. (ఐఎస్‌వో, ఐఇసి) 17011:2017 ప్రమాణాలను అనుసరించడంతో పాటు ఆసియా పసిఫిక్ అక్రిడిటేషన్ కోఆపరేషన్ (ఏపిఎసి) ఇంటర్నేషనల్ లాబొరేటరీ అక్రిడిటేషన్ కోఆపరేషన్ (ఐఎల్ఎసి), మ్యూచువల్ రికగ్నిషన్ అరేంజ్‌మెంట్ (ఎంఆర్ఎ)లో సంతకం చేసిన అక్రిడిటేషన్ సంస్థగా ఎన్ఏబిఎల్ గుర్తింపు కలిగివుందన్నారు. ఇది వివిధ రంగాల పరిశీలనా ల్యాబొరేటరీస్‌కు స్వచ్ఛంద అక్రిడిటేషన్ సేవలను అందిస్తుం దని తెలిపారు. ఎన్ఏబిఎల్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీరామ్ పిన్నమ రాజు మాట్లాడుతూ ఎన్ఏబిఎల్ వెబ్‌సైట్, అందులోని వనరులు, డాక్యుమెంటేషన్ గురించి వివరిం చారు. అనంతరం జరిగిన చర్చలో పరిశ్రమల ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు వారు సమాధానాలు ఇవ్వడంతో పాటు ఎన్ఏబిఎల్ గుర్తింపు ప్రక్రియపై అవగాహన కల్పించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కార్యక్రమ ప్రాముఖ్యత గురించి



మాట్లాడుతూ శ్రీసిటీని ప్రపంచస్థాయి తయారీ కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఎన్ఏబిఎల్ గుర్తింపు అవసరమని ఈ తరహా కార్యక్రమాలు దానిపై పూర్తి అవగాహన కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమాన్ని తిరుపతి ఐఐఎస్ఎస్ఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతనూ భట్టాచార్య ప్రారంభించగా, ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టరు వైవి రామిరెడ్డి తన ఉపన్యాసంలో గ్లోబల్ పోటీకి ధీటుగా పరిశ్రమలు తమ సామర్థ్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని, దానికి ఎన్ఏబిఎల్ సంస్థ ఎలా సహాయకారిగా ఉంటుందో వివరించారు. శ్రీసిటీ వైస్ ప్రసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి రమేష్ కుమార్ మాట్లాడుతూ ఎన్ఏబిఎల్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.



నాయకులకు మద్దతు పలికిన సిఐటియు నాయకులు

రైల్వే కార్మికుల ఎన్నికలు ప్రశాంతం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : చెన్నై డివిజన్ పుత్తూరు రైల్వే బ్రాంచిలో ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నిక ల లో దక్షిణ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ సిఐటియు అనుబంధ సంస్థ పోటీలో వుంది. ఈ సంఘానికి మద్దతుగా తిరుపతి సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రహ్మణ్యం, రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి మునిరాజా, స్థానిక సిఐటియు నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు. చెన్నై డివిజన్ దక్షిణ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సుకుమారన్ సందర్శించారు. పుత్తూరు సిఐటియు నాయకులు ఏ విజయ్, యాసిన్ బాషా, శివ, పురుషోత్తం, కృష్ణమూర్తి, బాల్జి, ప్రశాంత్, కృష్ణయ్య, శివ శంకర్ రావు, ప్రవీణ్, డీఆర్‌యు నాయకులు యువరాజు, సురేష్, విజయ భాస్కర్, నాగరాజు, స్టాలిన్ పాల్గొన్నారు.

బాలూకు ఘన సన్మానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఉత్తమ ఉపాధ్యాయ నిగా కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ప్రశంసలు అందుకున్న దిగువ సాంబయ్య పాళెం ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం ను గ్రామస్తులు, టిడిపి మండల అధ్యక్షులు గాలి మురళీనాయుడు గురువారం ఘనంగా సన్మానించారు.



బాలసుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న దృశ్యం

ఈ సందర్భంగా మురళీ నాయుడు మాట్లాడుతూ గత పన్నెండు సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన, కళలు, సాహిత్యంతో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దడంలో బాలు విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. తద్వారా మండలానికి మంచి పేరు తీసుకొస్తున్నందుకు అభినందనీయుడని ప్రశంసించారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు. ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, రిటైర్డ్ ఎంపీడీవో మోహన్ రావు, ముని చంద్రారెడ్డి, కస్తూరయ్య, శంకర్ రెడ్డి, ఐసిడిఎస్ సూపరువైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త మోహన్ రాణి, ఆదిలక్ష్మి, పద్మ, జయరత్న పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక కళ్యాణవీరభద్ర స్వామి ఆలయంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్, ఆంధ్రమహిళా మండలి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు గురువారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. దాత డాక్టర్ తనూజ 5 వేల రూపాయలు , మనపాటి విక్టరీయమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు 5వేల రూపాయలు దించారు. ముఖ్య అతిథి డాక్టర్ రోహిణమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి కార్యదర్శి విష్ణువందన, ఇన్నర్ వీల్ క్లబ్ కార్యదర్శి అనిత సభ్యులు స్నేహలత రెడ్డి, రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, ,పల్లం వెంకటేశ్వర్లు, మెదురు శ్రీనివాసాచారి పాల్గొన్నారు.



ఉపాధ్యాయునికి అంబేద్కర్ జాతీయ అవార్డు

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి జిల్లా పరిషత్ స్కూలు సోషల్ ఉపాధ్యాయుడు మేరిగ జాషువా అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపికైనట్లు భారత దళిత సాహిత్య ఆకాడమి వారు తెలిపారు. ఈనెల 8వ తేదీ ఢిల్లీలో ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. చల్లా యానాదులు, కప్పల యానాదుల 126 చిన్నారులను ఎంపిక చేసి వారికి విద్య నేర్పడంతో ఈయనకు ఈ అవార్డు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జాషువ మాట్లాడుతూ తాను గత 20 సంవత్సరాల నుండి వెనుకబడిన రెండు జాతుల బిడ్డలను దత్తత తీసుకొని వారికి అన్నీ రంగాల్లో అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ పనిచేసినట్లు పేర్కొన్నారు. తనను ఈ అవార్డుకు ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: 35వ డివిజన్ పరిధిలోని భవానినగర్ లో వివిధ పనులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం భూమి పూజ నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో 35వ డివిజన్ లో పలు చోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులు పగిలి పోవడంతో వాటిని మార్చడం, రోడ్ ప్యాచ్ వర్క్స్ కోసం 33లక్షలు మంజూరు చేసింది. ఈ పనులకు గురువారం ఉదయం టిడిపి కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణా నేతృత్వంలో భూమి పూజ చేశారు. నగరంలోని యాభై డివిజన్ లను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ శిరీష, టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, శ్యాప్ చైర్మన్ రవి నాయుడు, ఏపి అర్బన్ డెవలప్మెంట్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్ వూకా విజయ్ కుమార్, మబ్బు దేవనారాయణ రెడ్డి, పొలకల మల్లిఖార్జున్, శ్రీధర్ వర్మ, మహేష్ యాదవ్,రాజా రెడ్డి, మాజీ కౌన్సిలర్ నాగభూషణం, ఆర్సీ శ్రీనివాస్, ఎస్వీఎం శ్రీధర్, సుబ్బు యాదవ్, లక్ష్మి పాల్గొన్నారు.

సాయికుమార్‌కు నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఆచార్య వీధి చెందిన టిడిపి కార్యకర్త భాస్కర్ రాజు కుమారుడు సాయికుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, భౌతికకాయాన్ని సందర్శించే పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గోపి ఆచారి, జి బాబు, విక్కీ రాయల్, బాబు నాయుడు, పూల సుధా, టిడిపి ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చెంచయ్య, గోవింద ఆచారి, టిడిపి నాయకులు పాల్గొన్నారు .

'ముంతాజ్ హోటల్ అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టిటిడి, తుడా, పంచాయతీ నోటీసులను ఖాతరు చేయకుండా చేపడుతున్న ముంతాజ్ హోటల్ అక్రమ నిర్మాణాలను తక్షణమే కూల్చివేయాలని ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ టీటీడీ పాలక మండలి సమావేశంలో ముంతాజ్ హోటల్ నిర్మాణం రద్దు చేసి తీర్మానం చేసినా కూడా రాష్ట్ర ప్రభుత్వం పట్టించు కోకపోవడం దారుణమన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని బాలాజీ జూనియర్ కాలేజ్ లో విద్యార్థినివిద్యార్థులకు మూఢనమ్మకాల నిర్మూలనపై పరీక్ష నిర్వహించి వారికి ఆర్ఆర్ జనరల్ మర్చంట్ అధినేత ప్రభాకర్ రెడ్డి దాతృత్వంలో జ్ఞాపికలు, బహుమతులు అందించారు. అనంతరం జెవివి. అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ , కళాశాల కరస్పాండెంట్ కోటేశ్వరరావు మాట్లాడుతూ మూఢనమ్మకాలుపై అనార్థలను వివరించారు. ఈ కార్యక్రమంలో జే.వి.వి.అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచు నారాయణ, మామడూరు రాధయ్య, ప్రభాకర్, బాలాజీ జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పేరెంట్స్ టీచర్స్ సమావేశాలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): మీ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు ఓ అడుగు కార్యక్రమం పేరిట శనివారం మండల కేంద్రంలో నిర్వహించనున్న మెగా పేరెంట్స్ , టీచర్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల విద్యాశాఖ అధికారిణి లలిత కుమారి పిలుపు నిచ్చారు. మండలంలోని అన్ని ప్రాథమిక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారిణి లలిత కుమారి, ఎంఈవో భాస్కరయ్య పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు పట్టణంలో వాహనాల తనిఖీలను పోలీసులు గురువారం చేపట్టారు. ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో పోలీసు కానిస్టేబుల్స్ హరి,విజయ శేఖర్, కుప్పారావు, హోంగార్డు గురవయ్య పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద పలు వాహనాలను తనిఖీ చేశారు.

లడ్డూ కౌంటరు, బూందీ పోటు కార్మికులకు జీతాలు చెల్లించండి: సిఐటియు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుమలలో గురూజీ కంపెనీ తరపున లడ్డూ కౌంటరు, బూందీ పోటులో పనిచేస్తున్న 30 మంది కాంట్రాక్టు కార్మికుల కు మూడు నెలలుగా గురూజీ కంపెనీ జీతాలు చెల్లించకపోవడంతో ఆందోళన చెందుతున్నారని, కార్మికుల ఆకలి కేకలను టిటిడి యాజమాన్యం పట్టించుకోవాలని సిఐటియు నేత టి సుబ్రమణ్యం కోరారు. మూడు నెలల నుండి కార్మికులకు జీతాలు ఇవ్వకపోతే ఏమి తిని బతకాలని, వారి కుటుంబం ఎలా గడవాలని ప్రశ్నించారు. జీతాలు రాకపోవడంతో ఇంటి బాడుగలు కూడా చెల్లించలేక అవమానాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి జీతాలు గురించి టిటిడి హెల్త్ అధికారులు పట్టించుకోకపోవడం, తమకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరించడం మంచిది కాదన్నారు. కార్మికుల ఆకలి బాధలు పట్టించుకోవాలన్నారు. జీతాలు చెల్లించాలని అడిగితే డ్యూటీల నుండి తొలగిస్తామని బెదిరిస్తున్నారని కార్మికులకు జీతాలు చెల్లించని గురూజీ కంపెనీ టెండర్ రద్దు చేయాలని కోరారు. టిటిడి ఛైర్మన్, ఈవో జోక్యం చేసుకొని కార్మికులకు జీతాలు చెల్లించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

జాతీయ క్రీడా పోటీలకు నారాయణవనం విద్యార్థి

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: నారాయణవనం బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎంఎస్ నవీన్ కుమార్ గతవారం చిత్తూరు జిల్లాలో అరగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన అండర్ 14 రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో మన జిల్లా జట్టు క్యాచర్‌గా మంచి ప్రతిభను కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె సులోచన వ్యాయామ ఉపాధ్యాయులు ఏ జయప్రకాష్ తెలిపారు. ఈ నెలలో రాజస్థాన్ లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు ఏ. జయప్రకాష్ తెలిపారు, గత వారం తిరుపతి లోని మంగళం ట్రెండ్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన అండర్ 14 బేస్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలలో ఈ పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న ఎస్ బాలాజీ పాల్గొని బంగారు పతకాన్ని సాధించారని తెలిపారు. పుత్తూరు ఉప విద్యాశాఖ అధికారి హెడ్ ప్రభాకర్ రాజు క్రీడాకారులను గురువారం అభినందించి ప్రశంసా పత్రం అందించారు. ప్రోత్సహించిన వ్యాయామ ఉపాధ్యాయులు జయప్రకాశ్, సయదశివం ను అభినందించారు, పాఠశాలకు ఇంకా ఎన్నో క్రీడా పోటీలలో పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మీప్రసాద్, వర్మ, కోటి, వెంకటరమణ, మునివేలు, ఓసైమల్లి అభినందించారు.



నవీన్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నేల ఆరోగ్యంతోనే రైతు సౌభాగ్యం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: నేలలు ఆరోగ్యంగా ఉంటేనే పంటలు బాగా పండి తన సంతోషంగా ఉంటారాని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం, జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య తెలిపారు. వనమాల పేట, అప్పలాయగుంట గ్రామలలో ప్రపంచ నేలల దినం సందర్భంగా రైతుల శిక్షణలో ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక సాగులో విపరీతంగా రసాయనాలు వాడి, సేంద్రీయ ఎరువులను వాడకపోవడం వలన, సాగు భూములు సమస్యత్మకంగా మారుతున్నాయని వివరించారు. పంటలకు కలుపు మందులు, గుళికల మందులు వాడకంతో నేలలు నిర్జీవమైపోయి నిస్సారమవుతున్నాయని తెలిపారు. సేంద్రియ ఎరువుల వినియోగం పంటల వైవిధ్యం పెంచడం, పంట మార్పిడి, నేల, నీటి సంరక్షణ చర్యలు భూమి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని వివరించారు. భూసార పరీక్ష ఫలితాలను అనుసరించి, పంటలకు ఎరువుల వాడకం వల్ల, సాగు ఖర్చులు బాగా తగ్గుతాయని , తిరుపతి, భూసార పరీక్షా కేంద్రం, ఏడిఏ ప్రసాద్ రెడ్డి తెలిపారు. భూసార పరీక్షల ద్వారా పంటలలో మంచి దిగుబడులకు అవసరమైన మేరకే ఎరువులు వాడకం, పోషకాల లభ్యత పెరిగి పంటలలో అధిక దిగుబడులు వస్తాయన్నారు. తిరుపతి, వ్యవసాయ పరిశోధన స్థానం ఆవరణలోని వ్యవసాయ శాఖ భూసార పరీక్ష కేంద్రంలో ఉచిత భూసార పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుల తో పాటు మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్, భూసార పరీక్ష కేంద్రం ఏఓ రామాంజనేయ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు జాహ్నవి, గ్రామ సర్పంచ్ శేషాద్రి రెడ్డి పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: భూమి సారవంతం భవిష్యత్తుకు పునాది అని మండల వ్యవసాయాధికారిణి భారతి పేర్కొన్నారు. ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహార ఉత్పత్తికి నేల ప్రధాన వనరు అని, ఆహారం ప్రకృతిలో ప్రతి జీవికి జీవాధారమని రసాయన ఎరువుల మోజులో రైతులు నేడు నేలలకు జీవ జీవాన్ని సమకూర్చి సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించేశారన్నారు. అధిక రసాయన కాంప్లెక్స్ ఎరువులు వాడకంతో నేలలు చౌడుబారుతున్నాయని ప్రజల మౌలిక వసతుల కోసం, సాగు భూములను వ్యవసాయేతర పనులకు విచ్చలవిడిగా వినియోగించడం తగ్గించుకోవా లన్నారు. సాగులో వ్యాపార ధోరణి పెరిగి పంటల సాగులో వైవిధ్యం నశించిందని, రసాయన మందులు, గతగ్గించుకుంటే నేలలు సారవంతమమై అధిక దిగుబడులు వస్తాయన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయాధికారిణి

రామచంద్రపురం(చంద్రగిరి): జీవుల ఆరోగ్యం మట్టిపై (నేల పైన) ఆధారపడి ఉందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖం అన్నారు. ప్రపంచ నేలల ఆరోగ్య దినోత్సవం ను పురస్కరించుకొని చంద్రగిరి మండలం ఏ రంగంపేటలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి నాగరాజు, చంద్రగిరి మండల వ్యవసాయ అధికారి విజయభాస్కర్,గ్రామ సర్పంచ్ ఎర్రయ్య,ఉద్యానవన సహాయ అధికారిణి జాహ్నవి, విద్యార్థులు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారిణి స్రవంతి

రామచంద్రపురం: ప్రకృతి వ్యవసాయంతో మట్టిలోని పోషక విలువలను పెంచ వచ్చునని మండల వ్యవసాయ అధికారిణి స్రవంతి అన్నారు. మండలం లోని కుప్పంబాదూరు రైతు సేవా కేంద్ర పరిధిలోని రాయల చెరువు పేట గ్రామంలో గురువారం ప్రపంచ మట్టి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకం వలనమట్టిలోని పోషక విలువలు రోజు రోజుకీ తగ్గిపోతున్నా యని చెప్పారు. మట్టికి తిరిగి సహజశక్తిని ఇవ్వటానికి రైతులు ప్రకృతి సేద్యంను అనుసరించాలని సూచించారు. రసాయనిక ఎరువులు, పురుగుల మందుల వాడకం తగ్గించాలి అని కోరారు.రైతులు అందరి చేత రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, భూమిని కాపాడుతా మని,'భూ పరిరక్షణ' ప్రతిజ్ఞ చేయించారు. రైతులు భూ సార పరీక్షల చేయించుకోవాలన్నారు. రైతులకు భూ సార పరీక్షల ఫలితాల పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌వి వైద్య కళాశాలతో ఎస్వీయూ అవగాహనా ఒప్పందం

పజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, ఎస్వీ వైద్య కళాశాల పరస్పరం బోధన, పరిశోధనలలో పరస్పర అవగాహన ఒప్పందాన్ని గురువారం చేసుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉన్నతాధికారులు విసి ఆచార్య అప్పారావు, ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ పిఎ చంద్రశేఖరన్ లు అవగాహన ఒప్పంద పత్రాలను పరస్పరం అందిపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పసి టీవీసి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ వైద్య పరిశోధనలో వస్తున్న పలు మార్పులను పరిశోధించుటకు ఎస్వీయూలోని సైన్స్ విద్య సైన్స్ పరిశోధకులు అధ్యాపకులకు ఎంతో ఉపయోగకరంగా ఒప్పందం ఉంటుందన్నారు. కొన్ని అరుదైన వైద్య పరిశోధనలువర్సిటీలోని బాటనీ, జువాలజీ, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, బయో కెమిస్ట్రీ వంటి శాస్త్రాలలో సరికొత్త ఆవిష్కరణకు ఆస్కారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఈ కార్యక్రమంలో రుయా ఆస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ జి.రవిప్రభు, ప్రసూతి వైద్యశాల సూపరిటెండెం ట్, డాక్టర్ పార్థసారధి రెడ్డి, డీన్ డాక్టర్ బాలాజీ, వైస్ ప్రిన్సిపాల్స్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డి ఎస్ ఎన్ మూర్తి పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో సామవేద విభాగ పక్షాన రెండు రోజుల అఖిల భారత స్థాయిలో సదస్సు ఉప కులపతి ఆచార్య రాణీ సదాశివమూర్తి అధ్యక్షతన విద్యాలయ పరిపాలన భవనం రామేశ్వరం భవనంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ విసి ఆచార్య జిఎస్సార్ కృష్ణమూర్తి, గమ సారస్వత అతిథులుగా కేరళ రాష్ట్రానికి చెందిన శివశంకర నంబూద్రి హాజరయ్యారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి: ఎస్‌డబ్ల్యూఎఫ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కార్మికులపై ఆర్‌టిసి యాజమాన్యం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని మానుకోవాలని, అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని కోరుతూ గూడూరు డిపో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యదర్శి డి శ్రీధర్ ఆధ్వర్యంలో గూడూరు డిపో వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లు , కండక్టర్లు విధులు నిర్వహించే క్రమంలో జరిగే ప్రమాదాలు, కండక్టర్లు కేసులు పరిష్కరించి న్యాయం చేయడంలో డిపో మేనేజర్ నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ఇది మంచిది కాదని తెలిపారు. అందరి కార్మికుల పట్ల సమైక్యత భావంతో మెలగాలని 1/2019 సర్క్యులర్‌కు లోబడి చర్యలు పరిష్కరించాల్సి వున్నా తన ఇష్టానుసారం ఆయనకి అన్ని నచ్చిన వారికి ఏకపక్షంగా న్యాయం చేస్తూ మరి కొందరికి అన్యాయంగా విధుల నుండి సస్పెన్షన్ చేస్తున్నారని తెలిపారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని, అప్పటి వరకు ఆందోళన ఆపేది లేదని, లేకుంటే జరిగే పరిణామాలకు డిపో మేనేజరు పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిపో నాయకులు సిహెచ్‌రాము, ఈ భాస్కర్, కె కృష్ణయ్య, కె యస్. సుబ్రహ్మణ్యం, జివిరమణయ్య డిఎస్‌వాసులు, డిపిరావు, పి కిరణ్, సిఐటియు నాయకులు డి వెంకట్రామిరెడ్డి, బివి రమణయ్య, ఎస్ సురేష్, అడపాల ప్రసాద్, గుర్రం రమణయ్య పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

గోగర్భం డ్యామ్ వద్ద ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -తిరుమల: గత కొన్ని రోజులుగా తిరుమలలో కురిసిన వర్షాలతో జలాశయాలు నిండు కుండను తలపిస్తున్నాయి. నీటి నిల్వలు పూర్తిస్థాయికి చేరుకోవడంతో గోగర్భం డ్యామ్ వద్ద గురువారం టీటీడీ ప్రత్యేక పూజలు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి పాల్గొని పూజలు నిర్వహించి జల హారతి సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురవడంతో తిరుమలలోని గోగర్భం, ఆకాశగంగ, పాపవినాశనం డ్యామ్ లు పూర్తిగా నిండాయని తెలిపారు. మరోసారి వర్షం పడితే కుమారధార, పసుపుధార డ్యామ్ లు కూడా నిండిపోతాయని చెప్పారు. ప్రస్తుతం తిరుమలలో రోజుకు 50 లక్షల గ్యాలన్ల నీటిని వినియోగమవుతోందని పేర్కొన్నారు. ప్రస్తుత నీటి నిల్వలు 300 రోజుల తాగునీటి అవసరాలకు సరిపోతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్, డిప్యూటీ ఈవో లోకనాథం, వాటర్ వర్క్స్ ఈఈ సుధాకర్, వీజీవో సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డియన్‌డబ్ల్యూని కలిసిన ముస్లిం మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణంలోని మున్సిపాలిటీ మైనార్టీ నాయకులు చిత్తూరులోని డియన్ డబ్ల్యూ చెన్నారెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుత్తూరులోని షాదీ మహల్ వివరాలు తెలిపారు. అనంతరం ఆయన సానుకూలంగా స్పందించి బుధవారం వచ్చి నూతన కమిటీనికి భవనానికి సంబంధించిన వివరాలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు టిడిపి నాయకులు నగరి నియోజకవర్గం అధ్యక్షులు ఏ .రఫీ అహమ్మద్ పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.5 లక్షల విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థాన నిత్యాన్నదాన పథకానికి బెంగుళూరు వాస్తవ్యులు కే.సంతోష్ రూ.5 లక్షలు విరాళంగా అందించారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేసి అన్నదాన పథకంకు వినియోగించాలని సూచించారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వామీ అమ్మవార్ల దర్శన అవకాశం కల్పించారు. ఆలయ డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, పిఆర్ఓ రవి పాల్గొన్నారు.

అవార్డు బాధ్యత పెంచింది: జూలియన్ రాజు

ప్రజాశక్తి -రేణిగుంట: తనకు మదర్ తెరీసా అవార్డు రావడం మరింత బాధ్యతను పెంచిందని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు పేర్కొన్నారు. అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం సందర్భంగా కడప జిల్లా పోరుమామిళ్ల లో మదర్ తెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్రంలో ఉత్తమ సేవలు అందించిన వారికి మదర్ తెరిసా సేవ రత్న అవార్డులు ఇచ్చి సత్కరించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం, కడప పరిసర ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించే ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజుకు మదర్ తెరిసా ఫౌండేషన్ చైర్మన్ చిత్త రవి ప్రకాష్ రెడ్డి,ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ చిత్త విజయ ప్రతాప్ రెడ్డి,చిత్త గిరిప్రణీత్ రెడ్డి చేతుల మీదుగా మదర్ తెరిసా సేవా రత్న అవార్డును బహూకరించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జూలియన్ రాజు మాట్లాడుతూ అవార్డును అందించిన మదర్ తెరిసా ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. అవార్డులు రావటం మరింత బాధ్యతను పెంచిందన్నారు.

క్రైం న్యూస్

ముత్యాలమ్మ గుడిలో ఆభరణాలు చోరీ

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని రావిల్ల వారి కండ్రిగ ముత్యాలమ్మ గుడిలో డిసెంబర్ 4 రాత్రి దుండగులు తాళాలు పగలగొట్టి అమ్మవారి మెడలో ఉన్న 2 సవర్ల బంగారు ఆభరణాలు చోరీచేశారు. ఆలయ పూజారి ఆర్ విజయ్ భాస్కర్ గురువారం ఉదయం ఏర్పేడు పోలీస్ స్టేషన్లో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఏర్పేడు సీఐ జయచంద్ర కేసు నమోదు చేసి, క్లూ టీమ్స్ ఏర్పాటుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి): మండలంలోని పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో గాదంకి టోల్ ప్లాజా వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ యువతకి తీవ్ర గాయాలయ్యాయి. చంద్రగిరి పోలీసులు కథనం మేరకు గాదంకి టోల్ ప్లాజా సమీపంలో ఉన్న డిప్లొమా ట్రైనింగ్ సెంటర్ కు వెళుతున్న కలికిరి కి చెందిన లహరి(18) ని వేగంతో వచ్చి కారు ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసు కుంది. ఈ ప్రమాదంలో లహరి తలకు బలమైన గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్ ద్వారా క్షతగాత్రురాలు లహరిని తిరుపతికి తరలించారు. యువతి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. చంద్రగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలోని , పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారిపై రెండు వేర్వేరు వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో గురువారం తెల్లవారి జామున ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందినట్లు చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు తెలిపారు. చిత్తూరు నుండి తిరుపతి వెళ్లే రోడ్డు మార్గంలో చంద్రగిరి (నూరు హోటల్) ఫ్లై ఓవర్ పై 1 గంట ప్రాంతంలో గుర్తు తెలియని మగ మనిషిని వయస్సు సుమారు 40 -45 మధ్య ఉంటుంది, అతనిని గుర్తు తెలియని వాహనం డీకొని తీవ్ర గాయాలతో అక్కడికక్కడే చనిపోయారు తెల్లవారి జామున 2.30 గంటల ప్రాంతంలో హెరిటేజ్ డెయిరీ వద్ద ఉన్న ఫ్లై ఓవర్ పై ఒక గుర్తు తెలియని మనిషి వయస్సు సుమారు 40 -45 మధ్య ఉంటుంది, అతనిని గుర్తు తెలియని వాహనం డీకొని తీవ్ర గాయాలు పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పై ఫోటోలలో ఉన్న వారి వివరములు , గుర్తు తెలియని వాహనాలు గురించి గాని సమాచారం తెలిసినవారు చంద్రగిరి సీఐ - 9440796760 ఎస్ఐ-9440900720 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు.

గాదె సుబ్బారెడ్డికి ఘన నివాళి



ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో ప్రజానాట్యమండలి. తిరుపతి బాలోత్సవం సంయుక్త ఆధ్వర్యంలో 'గాదె సుబ్బారెడ్డి సంస్మరణ సభ' గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ సుబ్బారెడ్డి తన జీవితాంతం ప్రజా సాంస్కృతిక చైతన్య పెంపుదలకు కృషి చేశారని, తిరుపతి బాలోత్సవాన్ని సుబ్బారెడ్డి మార్గదర్శంతో , తోడ్పాటుతో నిర్విఘ్నంగా నిర్వహించామని, వారి సేవలు మరువలేనివన్నారు. సాహితి స్రవంతి కన్వీనరు ఓ వెంకట రమణ మాట్లాడుతూ అక్షరకళా జాతా, శ్రీ శ్రీ శతజయంతి, సుందరయ్య కళాజాతా, వేమన విజ్ఞాన జాతా అనేక కళారూపాలను రాష్ట్ర మంతా సమన్వయంతో నడిపించిన కార్యశీలి అన్నారు. నాటక రచయిత, నటుడు, దర్శకుడు ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు మరణం కళారంగానికి తీరని లోటు అన్నారు. సాహితీ విమర్శకులు ఆకాశవాణి మాజీ సంచాలకులు ఆకులు మల్లేశ్వరరావు మాట్లడుతూ 'ప్రజా సంస్కృతిని , ప్రజా కళారూపాల ద్వారా ప్రజల చైతన్యవంతం కలిగించడమే వారికి నిజమైన నివాళి " అన్నారు. గాదె సుబ్బారెడ్డి సంస్మరణ సభలో ప్రముఖులు టెంకాయిల దామోదరం, నడ్డి నారాయణ,రాజు , ముని లక్ష్మి శెల్వరాజు నివాళులు అర్పించారు.

రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలి: సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నేటి నుండి (శుక్రవారం) నుండి జనవరి 7వ తేదీ వరకు గూడూరు డివిజన్ లోని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులలో ప్రజలు సమస్యలు తెలిపి సద్విని యోగం చేసుకోవాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పేర్కొన్నారు. గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సుల ఏర్పాటుపై డివిజన్‌లోని తహశీల్దార్లు, ఎంపీడీవోలతో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు అనంతరం నిర్వహించిన సమావేశంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ డిసెంబర్ 6వ తేదీ నుండి అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఏ గ్రామంలో ఎప్పుడు నిర్వహిస్తామో రెండు రోజుల ముందు ప్రకటిస్తామని తెలిపారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులో తెలిపితే త్వరితగతిన పరిష్కరిస్తామని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రామచంద్రాపురం: నేడు కమ్మపల్లిలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని మండల తహశీల్దారు వెంకటరమణ కోరారు. తహశీల్దారు తన కార్యాలయంలో గురువారం రెవెన్యూ సిబ్బందితో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిటి అన్వర్ బాషా, ఆర్ ఐ లక్ష్మీనారాయణ, మండల సర్వేయర్ రమేష్ బాబు, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : నేటి నుండి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు తహశీల్దారు వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

సత్యవేడు: నేటి నుంచి నిర్వహించే రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు సుబ్రమణ్యం పేర్కొన్నారు. వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు, సర్వేయర్లు, డిజిటల్ అసిస్టెంట్లకు గురువారం అవగాహన నిర్వహించారు.

శ్రీకాళహస్తి: నేటి నుండి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాళహస్తి తహశీల్దారు లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై శిక్షణ

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: చిన్నగొట్టిగల్లు; యర్రావారిపాలెం మండల సాగునీటి సంఘాల ఎన్నికల సంబంధించిన ఎలక్షన్ అధికారులు; పోలింగ్ అధికారులకు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం శిక్షణ నిర్వహించారు. రెండు మండలాల లోని ఆరు చెరువులకు సంబంధించిన ఎన్నికల అధికారులు హాజరయ్యారు. ఈ శిక్షణలో ఎన్నికల అధికారులకు నీటి పారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చందారెడ్డి సురేష్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిన్నగొట్టిగల్లు ఎంపిడిఓ గిడ్డయ్య, యార్రావారిపాలెం తహశీల్దార్ పరమేశ్వర స్వామి, ఇరిగేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యం ఎత్తిరాజులు, కే.గిరీష్ కుమార్, సీ చంద్రమోహన్ పాల్గొన్నారు.

మహాసభల నిర్వహణకు సహకరించిన వారికి కృతజ్ఞతలు: సిపిఎం

ప్రజాశక్తి- సత్యవేడు: ఈనెల ఒకటి, రెండవ తేదీలలో సత్యవేడు పట్టణంలో నిర్వహించిన సిపిఎం 14వ జిల్లా మహాసభలు విజయవంతానికి సహకరించిన పట్టణ ప్రజలకు, నియోజకవర్గంలోని రాజకీయ, వ్యాపార, ఉద్యోగ, ప్రముఖులకు సిపిఎం తరపున ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి జనార్ధన్, మండల కార్యదర్శి మెలుగు రమేష్, నాయకులు నాగరాజు లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉచిత ఇసుకపై సమావేశం

ప్రజాశక్తి -సత్యవేడు: సత్యవేడు ఎంపీడీవో కార్యాలయం లో పంచాయతీ కార్యదర్శు లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉచిత ఇసుక పంపిణీపై గురువారం సమావేశం నిర్వహించారు.